క్లుప్తంగా

తిరుపతిలో యాచకుడి మృతి



గుర్తు తెలియని యాచకుడి మృతదేహం

పెద్దాపురం: మండలంలోని తిరుపతి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న కమ్యూనిటీ భవనంలో సుమారు 50 ఏళ్ల యాజకుడి మృతదేహం లభ్యం కాగా పంచాయతీ కార్యదర్శి భార్గవ్, వీఆర్‌ఓ వీరబాబు పెద్దాపురం పోలీసులకు సమాచారం అందించారు. ప్రతి శనివారం శృంగార వల్లభ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల వద్ద యాచిస్తుంటాడని స్థానికులు తెలిపారు. ఇతని పూర్తి వివరాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిమిత్తం పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రబీ ధాన్యం సేకరణపై అవగాహన

గొల్లప్రోలు: రబీ ధాన్యం సేకరణలో నిబంధనలు పాటించాలని, రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని తహసీల్దార్ మాచిరాజు ఉదయభాస్కరరావు, మండల ఏఓ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం రబీ ధాన్యం సేకరణపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాచిరాజు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి ధాన్యం సేకరణ పారంభించాలన్నారు. గోనె సంచులు, తేమ సేకరణ యంత్రాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సుచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, సొసైటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా పింఛన్ల పంపిణీ : ఎంపీడీఓ ఉషారాణి



జె.తిమ్మాపురంలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: మండలంలోని లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా పింఛన్లు పంపిణీ చేసే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పెద్దాపురం ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ జె.ఉషారాణి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓమాట్లాడుతూ అన్ని పంచాయతీల వద్ద పింఛన్ల పంపిణీకి సంబంధించి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. మొదటి రోజు సుమారు 40 శాతం పంపిణీ పూర్తియ్యిందన్నారు. మండలంలో సుమారు 11,962 మంది లబ్ధిదారులకు తొలిరోజు 4,911 మందికి అందజేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. అనంతరం జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల్లో కొంతమంది లబ్ధిదారులకు ఆమె పింఛన్లు పంపిణీ చేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

జగ్గంపేట: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు ద్వారా నిఘా పెంచామని జగ్గంపేట సీఐ లక్ష్మణరావు తెలిపారు. జగ్గంపేటకు చెందిన దేవి ఫిషరీస్ సహకారంతో కాట్రావులపల్లి, జగ్గంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన పరిశీలించారు.

ఏడీ పింఛెన్

- ఇక్కడంటే అక్కడని.. కాదు కాదు.. వేరేచోటని..
- పింఛన్ల కోసం పడరాని పాట్లు
- గత పాలనను గుర్తుచేశారంటున్న వృద్ధులు, దివ్యాంగులు

సామర్లకోట: సామాజిక పింఛన్లు అందుకోవడానికి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చంద్రబాబునాయుడు అండ్ కో ఫిర్యాదుల వల్ల వలంటీర్లు ఇళ్లకు వచ్చి పింఛన్లు అందజేసే కార్యక్రమానికి బ్రేక్ పడింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పింపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించడంతో లబ్ధిదారులు ఆయా సచివాలయాల వద్దకు చేరుకున్నారు. తమ ఇళ్ల సమీపంలోనే మూడు సచివాలయాలు ఉండటంతో ఎక్కడ పింఛన్లు ఇస్తారో తెలియక వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. భీమవరంపేట సమీపంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో మూడు సచివాలయాలు ఉన్నాయి. దాంతో ఆయా సచివాలయాలకు వెళ్లిన వారికి ఇక్కడ కాదు అక్కడ అనే సమాధానం రావడంతో లబ్ధిదారులు అక్కడ నుంచి మరో సచివాలయానికి వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు.

ఇప్పటి వరకు ఇబ్బంది లేకుండా పింఛను అందుకున్నాం



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే వలంటీర్లు తనకు పింఛను వస్తుందని చెప్పి పింఛను రాయించారు. దాంతో ప్రతి నెల ఒకటో తేదీన వేకువ జామునే పింఛను ఇంటికి తీసుకువెళ్లి ఇచ్చేవారు. ఎన్నికల పేరుతో ఇంటికి వచ్చి ఇచ్చే పింఛను సచివాలయానికి వెళ్లి తీసుకోవలసి వస్తోంది. గత నాలుగున్నర ఏళ్లుగా వలంటీర్లు అనేక రకాల సేవలు చేస్తూనే ఉన్నారు. వారిని అడ్డుకోవడం సరికాదు. ఎవరో చెప్తే ఓట్లు వేసేసే రోజులు పోయాయి. ప్రజలకు మంచి చేసిన వారిని వారు ఎన్నుకుంటారు.

– కంచర్ల రామచంద్రుడు, వృద్ధాప్య పింఛనుదారు, సామర్లకోట



సామర్లకోట 7వ సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

దివ్యాంగురాలిని.. రెండు చోట్ల తిరిగాం



దివ్యాంగురాలినైన నాకు ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికి వచ్చిన పింఛను ఇచ్చేవారు. ఏం జరిగిందో తెలియదు. సచివాలయంలో పింఛను ఇస్తారని చెప్పారు. దాంతో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న సచివాలయానికి వచ్చాను. ఇచ్చట కాదు బళ్లమార్కెట్‌లో ఉన్న సచివాలయంలో ఇస్తారని చెప్పడంతో అక్కడకి వెళ్లాను. నాకు తోడుగా మా నాన్న వచ్చి తీసుకు వెళ్లారు. గతంలో మాదిరిగానే ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు ఇవ్వాలి.

– యర్రంశెట్టి జ్యోతి, దివ్యాంగురాలు, సామర్లకోట

నాటి పింఛను పాట్లు గుర్తొస్తున్నాయ్

పెద్దాపురం: ఒకటో తారీకు వస్తే చాలు తెల్లరాకముందే తలుపు తట్టి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందించే ప్రభుత్వంపై కక్షకట్టిన తెలుగు తమ్ముళ్ల చర్యలకు గ్రామాల్లో పింఛన్ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అందించే పింఛన్ చేతికందే ఆనందాన్ని పొగట్టి, మీ తెదేపా హయాంలో పింఛన్ల కోసం పడిగాపులు కాసే విధంగా మళ్ళీ మాకు కష్టాలు తెచ్చిచారా అంటూ లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. మా పాపం ఊరిపోదని, నడవలేని స్థితిలో ఉన్న మాపై మీకెందుకీ కక్ష అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దాపురం మండలంలో ఒక్కటో తారీఖు సాయంత్రానికి పింఛన్ల పంపిణీ పూర్తి స్థాయిలో అందించే వారు. కానీ ఈ నెల మూడో తారీకు వచ్చినా పింఛన్ కోసం పంచాయతీ వద్దకు వచ్చి క్యూలో నిల్చుని తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఓటేసి మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంటామని చెప్తున్నారు లబ్ధిదారులు.



చదలాడ పంచాయతీ వద్ద పింఛన్ల కోసం క్యూ కట్టిన వృద్ధులు

సంక్షేమాభివృద్ధిని గుర్తించి గెలిపించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- దివిలిలో ఎన్నికల ప్రచారం

పెద్దాపురం: రాష్ట్రంలోత్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజా బలం వెన్నుదన్నుగా నిలుస్తుందని, రాష్ట్రంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని ప్రజలు గుర్తించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. విజయ సంకల్పయాత్ర పేరిట ఎమ్మెల్యే అభ్యర్థిగా బుధవారం మండలంలోని దివిలిలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ నాయకులు నరాలశెట్టి త్రినాథ్, సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ విజ్జపు రెడ్డి రమేష్, ఎంపీటీసీ భద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తెరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. మీలో ఒక్కడిని.. స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడినైన నన్ను ఆదరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని దొరబాబు కోరారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించుకోవాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీకి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అగాహన ఉందని తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని దొరబాబు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘరావు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, కనపర్తి చీమదొర, గోలి రామారావు, కరణం భాను, పెంటా విజయ్‌కుమార్, బీపెల్లి పండు, కురిమెళ్ల లోవరాజు, సుందరెడ్డి రాజు, కనపర్తి బాబి, వాసిరెడ్డి శ్రీనివాస్, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల నానాజీ, కుంచే వెంకన్న, జట్లా మోహన్, చేదులూరి చెల్లారావు, వట్టికూటి రాజ్‌కుమార్, మెండి శ్రీను, కుంచే అమరావతి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



దివిలిలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న దొరబాబు

మాదిగల ఐక్యత చాటి చెబుతాం

- వైఎస్సార్ సీపీకే మా మద్దతు
- నియోజకవర్గ మాదిగ సంఘ నాయకులు

సామర్లకోట: మాదిగల ఐక్యతను చాటి చెప్పడానికి ఈ నెల 12వ తేదిన మాదిగల ఆత్మీయ సమేశనం ఏర్పాటు చేసినట్టు మాదిగ ఐక్యవేదిక నాయకులు పలివెల జనార్ధన్, కాళ్ల లక్ష్మీనారాయణ, కాతేటి అరుణ్‌కుమార్ తెలిపారు. మాదిగల ఉనికి తెలియజేయడానికి మాదిగలు అందరూ ఒకే తాటిపైకి వచ్చారన్నారు. నియోజకవర్గంలో మాదిగలు కోల్పోతున్న అవకాశాలను తెలుసుకుని అధికార పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు వారు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతీ మాదిగ ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీతో జరుగుతున్న మేలును తెలియజేసి ప్రతి ఒక్కరూ ఆ పార్టీ మద్దతు ఇవ్వాలని కోరతామన్నారు. ఈ మేరకు 12న నియోజకవర్గ స్థాయి మాదిగల సమ్మేళం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, మాదిగ నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ సంఘ నాయకులు విప్పర్తి రవి, చిందాడ ప్రకాశరావు, మిరియాల సాగర్, జొన్నాడ రమేష్, కాంద్రకోట హరి, ఉప్పాడ రమణ, తాతపూడి చిన్న, మహేష్, నరేష్, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ కాళ్ల లక్ష్మీనారాయణ

ఇది కాదా.. అభివృద్ధి?

- గత ప్రభుత్వంలో రోడ్లు గతుకుల మయం
- నేటి జగనన్న పాలనలో సాఫీగా పయనం

పెద్దాపురం: ప్రజా పాలనలో సంక్షేమం ఒక్కటే కాదు.. అభివృద్ధి పనులు చేసి చూపించారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సంక్షేమం పేరుతో బటన్ నొక్కి ప్రజలకు డబ్బులు వేస్తే సరిపోతుందా అనే ప్రతిపక్ష పార్టీలకు ఈ అభివృద్ధి కనిపించకపోవడం విడ్డూరం. గత ప్రభుత్వ పాలనలో అధ్వానంగా, దయనీయంగా ఉన్న రహదారులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో ఎంతో బాగుపడ్డాయి. అద్దంలా ఉన్న చాలా రహదారులు విపక్షాలకు కనపడకపోవడం శోచనీయం. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మండల పరిధిలో ప్రధాన రహదారులు గత ప్రభుత్వంలో తూట్లు పడినా పట్టించుకున్న దాఖలాలు లేవు. నేడు మండల, నియోజకవర్గ పరిధిలో దాదాపు అన్ని ప్రధాన రహదారులు నూతనంగా నిర్మించారు. దీంతో ప్రయాణికులు ఆయా రహదారుల్లో సురక్షిత ప్రయాణం చేస్తున్నారు. ప్రధానంగా సామర్లకోట–ప్రత్తిపాడు రహదారిలోని వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, రాజుపాలెం, కిర్లంపూడి వరకు నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడిన పరిస్థితులు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం ఆ రహదారిని రూ.3.96 కోట్లు, వడ్లమూరు–పెద్దాపురం రహదారికి సుమారు రూ.2 కోట్లతో నిర్మించారు. దీంతో ఆయా రహదారుల్లో ప్రయాణికులు సురక్షితంగా రైరయ్యిన దూసుకుపోతున్నారు. వాలుతిమ్మాపురం–కొండపల్లి, మర్లావ నుంచి రామచంద్రపురం వరకు ఉన్న 8.9 కిలోమీటర్ల రహదారిని రూ.1.80 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.



ప్రత్తిపాడు–సామర్లకోట రహదారిలో గోరింటలో నాడు రోడ్డు దుస్థితి (ఫైల్)



ప్రస్తుతం గోరింట రహదారిలో నేడు అద్దంలా ఉన్న రహదారి



ప్రత్తిపాడు రోడ్డులో దివిలి–రాజుపాలెం వద్ద నాడు రోడ్డు దుస్థితి ఇది (ఫైల్)



దివిలి ప్రధాన రహదారి.. విశాలంగా.. సాఫీగా పయనించేలా..

ఏ నిమిషానికి ఏమి జరుగునో..!

- ఇళ్లపై వాలేలా విద్యుత్ తీగలు
- ఆందోళన చెందుతున్న గణేష్‌కాలనీవాసులు

పెద్దాపురం: ఏళ్ల తరబడి ఉన్న కాలనీ. విద్యుత్ సౌకర్యం కోసం కాలనీవాసుల ఆందోళనల నేపథ్యంలో ఎట్టకేలకు విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఏళ్ల గడిచే కొద్దీ కాలనీలో ఇళ్లు పెరిగాయి. విద్యుత్‌లైన్ల కోసం వేసిన స్తంభాలు కూలే పరిస్థితికి రావడం, కాలనీలో ఉన్న విద్యుత్ లైన్లు ఇంటి వసారాలపై ఒరగడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయాందోళనల మధ్య జీవనం సాగిస్తున్నారు పెద్దాపురం గణేష్ కాలనీ వాసులు. బుధవారం కాలనీకి చెందిన రాంబుడ్డి సత్తిబాబు, మేకా హరి, గడపా సుబ్బారావులకు చెందిన ఇళ్లతో పాటు సుమారు 8 ఇళ్లకు సంబంధించి కాలనీలో విద్యుత్ వైర్లు ఇళ్లపై వాలడంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందనని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులు స్పందించి స్తంభాలు, విద్యుత్ లైన్లు మార్చాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ రామారావును వివరణ కోరగా కాలనీకి సంబంధించి విద్యుత్ వైర్లపై ఫిర్యాదు లేదని, తమ దృష్టికి వచ్చిన కారణంగా సత్వరమే వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



గణేష్ కాలనీలో ఇళ్లకు చేర్చి ఉన్న విద్యుత్ వైర్లు



చెందుర్తిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత, జెడ్పీటీసీ లోవరాజు తదితరులు



ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గీత, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్

ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తా

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- చెందుర్తిలో ఎంపీ అభ్యర్థి సునీల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం

గొల్లప్రోలు: ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తానని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో బుధవారం పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రతి ఇంటా వారికి స్థానికులు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. పిఠాపురం ఆడపడుచుగా తనకు ప్రజలకు చేవ చేసే భాగ్యం కల్పించాలని వంగా గీత కోరారు. మాకు ఏ సమస్య వచ్చినా చేప్పుకునే అవకాశం మీ దగ్గర మాత్రమే ఉంటుందని, అందుకే మాకు మీరే ఎమ్మెల్యే కావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని స్థానికులు ముక్తకంఠంతో చెప్పారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ తాను గతంలో ఎమ్మెల్యేగా పిఠాపురం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్య దొర, సర్పంచ్ అల్లి పాప, ఉపసర్పంచ్ కోనేటి సుధ, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుక్కా సుబ్బారావు, పార్టీ నాయకులు కొనేటి పెదకాపు, మొగలి బాబ్జీ, మొగలి అయ్యారావు, దాసం వేంకటేష్ ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండే ఎండకు టండాగా..

- శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ
- సీజనల్ వ్యాపారంతో ఎందరికో ఉపాధి
- పల్లెల నుంచి పట్టణాలకు వలస

బోట్‌క్లబ్: ఎండలు మండుతున్నాయి. బయటకు వెళితే గొంతు ఎండిపోతుంది. దీంతో దాహం తీర్చుకునేందుకు శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది. వారం రోజులుగా ఎండలు విపరీతంగా ఉండడంతో దీనికి అనుగుణంగానే నగరంలో స్థానిక సర్పవరం జంక్షన్, బోట్‌క్లబ్ పార్కు, నాగమల్లితోట జంక్షన్, జేఎన్‌టీయూకే, భానుగుడి, బాలాజీచెరువు, జగన్నాథపురం, జెడ్పీ సెంటర్ ఇలా ఎక్కడపడితే అక్కడ శీతల పానీయాల దుకాణాలు కన్పిస్తున్నాయి. పలు సెంటర్లలో ఐస్‌క్రీం దుకాణాలు పుచ్చకాయల విక్రయాలు బాగా పెరిగాయి. మార్కెట్‌లో దొరికే వివిధ రకాల రుచులతో కూడిన ఫ్లేవర్లతో ఫ్రూట్ సలాడ్‌లను తయారుచేస్తున్నారు. ఆరెంజ్, నిమ్మ, మిక్స్‌డ్ ఫ్రూట్ తదితర సలాడ్‌లు గ్లాసు రూ.20 వరకూ విక్రయిస్తున్నారు. చెరకురసం నిమ్మసోడా బండ్లు ఎక్కడ చూసినా కనిస్తున్నాయి. నిమ్మకాయ మసాలా సోడా, నిమ్మకాయ సోడా, అల్లంతో చెరుకురసం, నిమ్మకాయ చెరుకు రసం ఇలా రకరకాలుగా నిమ్మకాయతో చెరుకు రసం ఉన్న గ్లాసు రూ.20కి విక్రయిస్తున్నారు. మండుతున్న ఎండలకు ఉపశమనం పొందేందుకు ప్రజలు ఐస్‌క్రీం పార్లర్లవైపు పరుగులు పెడుతున్నారు. దీంతో స్థానిక కుళాయిచెరువు ఎదురుగా ఉన్న పలు ఐస్‌క్రీం పార్లర్లు కిటకిటలాడతున్నాయి. రకరకాల ఫ్లేవర్లతో ఐస్‌క్రీం విక్రయిస్తున్నారు. ఒక్కొక్క ఐస్‌క్రీం రూ.20 నుంచి రూ.80 వరకూ కొనుగోలు చేస్తున్నారు.



రాజేశ్వరినగర్‌లో పుచ్చకాయలు తింటున్న ప్రజలు

ఎంతో మందికి ఉపాధి

వేసవిలో సీజనల్‌గా వెలిసిన శీతల పానీయాల దుకాణాలు వందలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. మామూలు రోజుల్లో కూలిపనులు చేసుకుని వారు ఆటోలు నడిపేవారు, కూరగాయాలు విక్రయించేవారు పనులు మానివేసి ఎండాకాలం ముగిసే వరకూ శీతల పానీయాల దుకాణాలు నడుపుతున్నారు. కేవలం రూ.పదివేలు పెట్టుబడితో జీవనోపాధి పొందుతున్నారు.

కొబ్బరి బొండంతో దాహానికి చెక్

వేసవిలో శీతల పానీయాల కంటే కొబ్బరి బొండం తాగడం ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు. దీంతో కొబ్బరి బొండాలు విక్రయించే దుకాణాలు నగరంలో రోజురోజుకీ పెరుగుతున్నాయి. గత నెలలో రూ. 15 ఉండే కొబ్బరి బొండం ప్రస్తుతం రూ.20కి చేరింది. అయినప్పటికీ కొబ్బరిబొండాలు తాగేందుకు ప్రజలు వెనుకాడడం లేదు. కాకినాడ నగరంలో గతంలో కేవలం 30 మాత్రమే కొబ్బరి బొండాలు విక్రయించే షాపులు ఉండేవి. కానీ ప్రస్తుతం 50కి పైగా ఉన్నాయంటే కొబ్బరి బొండాలకు ఉన్న క్రేజ్ వేరే చెప్పాల్సిన పనిలేదు.



ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో చెరుకురసం తాగుతున్న జనం